సాక్షి నంద్యాల

గురువారం ၊ 29 ၊ ఫిబ్రవరి ၊ 2024



కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు బుధవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు.



ఘనంగా సైన్స్ దినోత్సవం

హాలహర్వి: సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు.



భక్తులకు శివ'గంగ' సిద్ధం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రీశైల దేవస్థాన అధికారులు చర్యలు తీసుకున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

సైన్స్‌తోనే మానవ మనుగడ సాధ్యం



సైన్స్‌ఫేర్‌ను పరిశీలిస్తున్న డీఈఓ సుధాకర్ రెడ్డి

డోర్నిపాడు: సైన్స్‌తోనే మానవ మనుగడ సాధ్యమని, విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని డీఈఓ సుధాకర్ సూచించారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సైన్స్‌ఫేర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ విద్యార్థులతో మాట్లాడారు. సర్ సీవీ రామన్.. రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజునే సైన్స్ డేగా నిర్వహించుకుంటున్నామన్నారు. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని, దానివల్లే అది తన గమనాన్ని మార్చుకుంటుందని తన పరిశోధనల ద్వారా రుజువు చేసినట్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, పీడీ దేవేంద్ర, ఉపాధ్యాయులు నాగరాజు, విజయలక్ష్మి, గడ్డం చెన్నయ్య, రమణయ్య, రవిప్రకాశ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 1 నుంచి ఓపీ సేవలు ప్రారంభం

డోన్: స్థానిక గుత్తిరోడ్డు పక్కన రుద్రాక్షగుట్ట ప్రాంతంలో రూ.40 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చి 1 నుంచి అవుట్ పేషెంట్ బ్లాక్ ప్రారంభిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహమ్మద్ హనీఫ్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నూతన భవనాల్లో మరికొన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తున్నందున దశల వారీగా పాతపేట ఆసుపత్రిని నూతన ఆసుపత్రికి మారుస్తున్నామన్నారు. ప్రస్తుతం పట్టణంలోని పాతపేటతో పాటు నూతన ప్రభుత్వాసుపత్రిలో కూడా ఓపీ చూసేందుకు డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలతో పాటు పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న 'టెట్'

నంద్యాల(న్యూటౌన్): టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్(టెట్) కొనసాగుతోంది. బుధవారం నాలుగు కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆర్జీఎం, శాంతిరాం, ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్, రామకృష్ణ డిగ్రీ కాలేజీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతున్నాయి. ఎస్ఏ-1, 2 పరీక్షలకు 1,054 అభ్యర్థులకు గానూ 66 మంది గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

జూపాడుబంగ్లా/శ్రీశైలంప్రాజెక్ట్: కర్నూలు-కడప ఆయకట్టు కింద చివరిదశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కాల్వకు నీటిని సరఫరా చేయటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం మూడు పంపుల ద్వారా కేసీ కాల్వకు 740 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ బుధవారం తెలిపారు. ఈ నీటిని లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 600 క్యూసెక్కులను సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం కేసీ కాల్వ కింద 2వేల ఎకరాలు పైబడి పంటలు చివరిదశలో ఉన్నట్లు తెలిపారు. శ్రీశైలం జలాశయంలో బుధవారం సాయంత్రానికి 815.90 అడుగుల నీటిమట్టం ఉండగా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి డ్యాంలో 810 అడుగులకు నీటిని పంపింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు.

పోస్టల్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న శివనాగరాజు

నంద్యాల(వ్యవసాయం): పోస్టల్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏపీ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ శివనాగరాజు సూచంచారు. బుధవారం గాంధీచౌక్‌లోని హెడ్‌పోస్టాఫీసులో పోస్ట్‌మెన్‌లకు, ఏజెంట్లకు, పోస్టల్ సిబ్బందికి పోస్టల్ పథకాలపైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసులో అన్ని వయస్సుల వారికి లాభాలు వచ్చేలా పథకాలు అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. అనంతరం ఇటీవల నందికొట్కూరు పోస్టుమెన్ మరణించడంతో ఆయన కుటుంబానికి ఇన్సూరెన్స్ కింద రూ.3.22 లక్షలను అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి జగనన్న భరోసా!

వైద్య రంగంలో జగనన్న ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ కంటి వెలుగు, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతి పల్లెలో ఏర్పాటు చేసి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది. అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేయించి ఆదుకుంటోంది.

- వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు
- విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుతో అందుబాటులోకి వైద్యసేవలు
- పల్లెల్లో కార్పొరేట్‌స్థాయి వైద్యం
- నాడు–నేడుతో పీహెచ్‌సీల ఆధునీకరణ
- జిల్లాలో 53 పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం
- ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యశ్రీ అమలు
- రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పెంపు



కోవెలకుంట్లలో అన్ని హంగులతో నూతనంగా నిర్మించిన 30 పడకల ఆసుపత్రి

కోవెలకుంట్ల: నంద్యాలలో జిల్లాస్థాయి ఆసుపత్రి, 11 కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, 53 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 369 వైఎస్సార్ విలేజ్‌క్లినిక్‌ల ద్వారా ప్రజలకు వైద్య సేవలందుతున్నాయి. పల్లె ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయాత్మక మార్పులు తీసుకొచ్చింది. మంచానికి పరిమితమై ఇబ్బంది పడుతున్న రోగుల ఇళ్ల వద్దకే ప్రభుత్వ వైద్యులు వెళ్లి వైద్యం అందిస్తున్నారు. గతంలో ఏళ్ల తరబడి పాడుబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అరకొర వైద్యసేవలందించేవారు. పీహెచ్‌సీల్లో సరైన సదుపాయలు కూడా ఉండేవి కాదు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి సర్కార్ తీసుకున్న విప్లవాత్మక మార్పులు పేదల పాలిట వరంగా మారాయి. లక్షలాది రూపాయాలు వెచ్చించి పీహెచ్‌సీలను ఆధునీకరించడంతోపాటు కొత్త భవనాలు నిర్మించి సకల సదుపాయాలు కల్పించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టారు. ఆరోగ్యశ్రీకి పూర్వవైభవం తీసుకు వచ్చి రూ.10 లక్షల వైద్యాన్ని రూ.25 లక్షల వరకు పెంచింది.

బనగానపల్లెలో వంద పడకల ఆసుపత్రి

బనగానపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి రూ.22 కోట్లతో అన్ని హంగులతో నిర్మించారు. ఆసుపత్రిలో గైనిక్, చిన్నపిల్లలు, ఎముకలు, ఈఎన్‌టీ(ముక్కు, చెవి, గొంతు), జనరల్ ఫిజీషియన్, ప్రసవాలు, ఫిజియోథెరపీ, బ్లడ్‌స్టోరేజీకి సంబంధించి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశారు. ఆయా విభాగాలకు సంబంధించి ఇప్పటి వరకు 15 మంది స్పెషలిస్టు డాక్టర్లను నియమించారు. మరో నలుగురు డాక్టర్లను నియమించాల్సి ఉంది. 30 మంది స్టాఫ్‌నర్సులు, నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు, పోస్టుమార్టం స్టాఫ్ తదితర సిబ్బంది ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. అన్ని విభాగాలకు స్పెషలిస్టు డాక్టర్లు, వైద్య సిబ్బందితో మెరుగైన వైద్యసేవలందిస్తున్నారు. అలాగే కోవెలకుంట్ల పట్టణంలో రూ.3.80 కోట్లతో 30 పడకల ఆసుపత్రి



వైద్యం కోసం ఓపీ నమోదు చేసుకుంటున్న రోగులు

ద్వారా ప్రజలకు వైద్యసేవలందుతున్నాయి. గైనిక్, సర్జన్, చిన్నపిల్లల విభాగం, ఎంసీహెచ్, ఓటీ, అత్యవసర విభాగాలు, ఈసీజీ, ఎక్స్‌రే వసతులు అందుబాటులో ఉన్నాయి. ఆసుపత్రిలో ఏడుగురు డాక్టర్లు, తొమ్మిది మంది స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నిషియన్లతో కలిపి 31 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ఇప్పటి వరకు 28 మందిని నియమించారు. అవుకులో రూ.2.50 కోట్లతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు పాత సీహెచ్‌సీ భవనం నుంచి కొత్తగా కనెక్టివిటీ హాలు, అడ్మిషన్ గది, పేషెంట్ వివరాల నమోదుకు ప్రత్యేక కౌంటర్, మార్చురీ, రోగులు వేచి ఉండేందుకు ప్రత్యేక గది, పాత సీహెచ్‌సీ భవన మరమ్మతులు, తదితర సదుపాయాలతో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

వైద్యం కష్టాలకు చెక్

బనగానపల్లెలో వంద పడకలు, కోవెలకుంట్లలో 30 పడకల ఆసుపత్రులు అందుబాటులోకి రావడంతో శాశ్వితంగా వైద్యం కష్టాలకు చెక్ పడింది. గతంలో ఏ చిన్న రోగమొచ్చినా నంద్యాల, కర్నూలు, జమ్మలమడుగు, తదితర పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. గుండె, మెదడు, కిడ్నీ, తదతర వైద్య సేవలకు హైదరాబాదు, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. వైద్యం కోసం ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కొనేవారు. ఈ కష్టాలకు చెక్ పెడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసి ప్రజల ముంగిటకే వైద్య సేవలను తీసుకొచ్చింది.

విలేజ్ క్లినిక్‌ల్లో వైద్యసేవలు

జిల్లాలోని 29 మండలాల పరిధిలో 369 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు అందుబాటులో ఉన్నాయి. క్లినిక్‌లో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు వైద్యసేవలందిస్తున్నారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో పాటు సాధారణ జ్వరం, దగ్గు, జలుబు, తదితర జబ్బులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తారు. విలేజ్‌క్లినిక్‌లకు వచ్చేందుకు ఆస్కారం లేక మంచానికి పరిమితమైన పేషెంట్లకు ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలందించాల్సి ఉంది. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వివిధ జబ్బులకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు రెఫర్ చేయాల్సి ఉంది. విలేజ్ క్లినిక్‌లలో మలేరియా, డెంగీ, తదితర జ్వరాల నిర్ధారణకు ర్యాపిడ్ టెస్టులు నిర్వహించే వసతులు అందుబాటులో ఉన్నాయి.

వైద్యం కోసం ఎక్కడికో వెళ్లాల్సిన పని లేదు



ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను ప్రభుత్వం ఆధునీకరించడంతో పాటు గ్రామ సచివాలయ పరిధిలో విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. క్లినిక్‌ల్లో వైద్య సిబ్బందిని నియమించి అన్ని రకాల జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో చిన్న జ్వరమొచ్చినా పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి.

– దస్తగిరి, సౌదరదిన్నె, కోవెలకుంట్ల మండలం

మెరుగైన వైద్యసేవలందిస్తున్నాం



30 పడకల ఆసుపత్రికి సంబంధించి ప్రభుత్వం డాక్టర్లు, వైద్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించింది. కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, సంజామల, తదితర ప్రాంతాల నుంచి రోజుకు 300 మంది ఓపీ పేషెంట్లు వస్తున్నారు. అన్ని రకాల జబ్బులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నాం. నాడు– నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఆసుపత్రుల రూపురేఖలను మార్చివేసింది. – డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్‌సీ ఇన్‌చార్జ్, కోవెలకుంట్ల

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



రైతు భరోసా చెక్కును విడుదల చేస్తున్న జెడ్పీ చైర్మన్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్, జేసీ, రైతులు

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి వైఎస్సార్ రైతుభరోసా మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేత

నంద్యాల: రైతన్నల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ రైతు భరోసా–పీఎం కిసాన్, వైఎస్ఆర్ సున్నా వడ్డీలకు సంబంధించిన ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వంగాల భరత్ కుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర బెస్త సంక్షేమ అభివృద్ధి సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, మండల వ్యవసాయ అధికారులు, రైతులు హాజరై వీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వైఎస్ఆర్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం కింద రైతులకు వరుసగా ఐదో ఏడాది మూడో విడత, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం కింద పంటల రుణాలకు వడ్డీ రాయితీ నగదును ప్రభుత్వం జమ చేసిందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు రూ.1,426 కోట్ల ఆర్థిక లబ్ధిని రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ కింద రైతులకు వరుసగా ఐదవ ఏడాది మూడవ విడతగా జిల్లాలో అర్హులైన 2,34,151 మందికి రూ.47.06 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమంలో భాగంగా రబీ 2021–22, ఖరీఫ్ 2022 లో రుణాలు పొంది సకాలంలో చెల్లించిన అర్హులైన 25,029 మంది రైతన్నలకు 11.08 కోట్లు జమ చేశామన్నారు. అనంతరం రైతుల సమక్షంలో రైతు భరోసా, వైఎస్ఆర్ సున్న వడ్డీ పంట రుణాల చెక్కును విడుదల చేశారు.

మహాశివరాత్రికి 1.20 లక్షల లడ్డూలు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందికి వచ్చే భక్తుల కోసం లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేస్తున్నామని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పనులను బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 1.20 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధంగా ఉంచుతామన్నారు. ఆలయ పరిధిలో రూ.50 లక్షలతో కల్వర్టులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునేవారి నుంచి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని, భక్తుల వాహనాలకు దగ్గర్లోనే పార్కింగ్ స్థలం కేటాయించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏఈఓలు మధు, ఓంకారం వెంకటేశ్వరుడు, ఏఈ శ్రీనివాసులు ఉన్నారు.

మిర్చి పైర్లను ఎండనివ్వం

- నీరిచ్చి ఆదుకుంటాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పాణ్యం: జిల్లా పరిధిలోని ఎస్సార్బీసీ ఆయకట్టు కింద సాగైన మిరప పైరుకు చివరి తడి నీరిచ్చి ఆదుకుంటామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పాణ్యం, ఇతర మండలాల రైతులు ఎమ్మెల్యేతో సాగునీటి విషయంపై చర్చించారు. ప్రస్తుతం మిరప చివరి దశలో ఉందని, ఒక తడితో పంటలు చేతికొస్తాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సీఈ కబీర్‌బాషాతో మాట్లాడారు. గోరుకల్లు జలాశయం నుంచి రైతలకు చివరి తడిగా తగినంత నీటిని విడుదల చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఈ శుక్రవారం నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా నీటిని వృథా చేయకుండా ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

ఆశాజనకంగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): స్థానిక మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. బుధవారం సూపర్–10 రకం జనరల్ క్వింటా గరిష్ట ధర రూ.15,100, మధ్యస్థ ధర రూ.13,500, కనిష్ట ధర రూ.11,800 గా నమోదైంది. ఇదే రకం తాలు కాయ జనరల్ గరిష్ట ధర క్వింటా రూ.9,000, మధ్యస్థ ధర రూ.7,800, కనిష్ట ధర రూ.6,000 గా నమోదైనట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

మద్దతు ధరతో శనగ కొనుగోళ్లు

నంద్యాల(సెంట్రల్): మద్దతు ధర క్వింటా రూ.5,440తో శనగలను కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ–క్రాప్, ఈ– కేవైసీ చేయించుకున్న శనగ రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో గురువారం నుంచి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి తీసుకువచ్చే సరకు మాత్రమే కొంటామన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): 2024–25 విద్యా సంవత్సరంలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ బ్రహ్మంనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలన్నారు. వచ్చే నెల 14వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, బలహీన వర్గాలకు 6శాతం సీట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. రిజిస్ట్రేషన్‌లు వెబ్‌సైట్ http://cse.ap.gov.inలో చేసుకోవచ్చన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు చేయండి



తెలుగు పేట స్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ

నంద్యాల(సిటీ): ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డిని ఆదేశించారు. బుధవారం పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను మున్సిపల్ అధికారులు, ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ర్యాంపులు, టాయిలెట్లు, నీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి, ఎన్నికల డీటీ రమాదేవి ఉన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యత



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

సంజామల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. బుధవారం సంజామలలో రూ.1.54 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ పోచా మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి అవినీతి రహిత పాలనను అందిస్తున్నారన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మర్పులు తెచ్చారన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో ఎన్నడూలేనంతగా అభివృద్ధి జరిగిందన్నారు. సంజామలకు రూ.32 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి కుటుంబాలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెలుగులు నింపారని గుర్తు చేశారు. కరోన కాలంలోనూ సంక్షేమ పథకాలు కొనసాగించారన్నారు. చంద్రబాబు సీఎం అయితే సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్‌రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా జోనల్ ఇంచార్జ్ శీలా రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బీవీ నాగర్జున రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్నబాబు, ఎంపీటీసీ రమణమ్మ పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి



చెర్లోపల్లె గ్రామాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

- నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

అవుకు: ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో పర్యటించారు. సచివాలయ ఆవరణంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో గొడవలకు దూరంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినా వెంటనే పోలీసులను సంప్రదించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఎవరికి నచ్చిన నాయకుడికి వారు ఓటు వేసుకోవాలన్నారు. అనవసరమైన వివాదాలకు వెళ్లి కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ఎక్కరాదన్నారు. మోటార్‌సైకిల్ ప్రయాణికులు హెల్మెట్ ధరించాలన్నారు. ఇక సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే లింక్‌లను ఓపెన్ చేయొద్దన్నారు. అనంతరం చెర్లోపల్లె పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి, అవుకు ఎస్ఐ కిరణ్ బాబు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

బనగానపల్లె రూరల్: అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం రాత్రి రామక్రిష్ణాపురం గ్రామంలో ఎస్పీ పర్యటించారు. సార్వత్రిక ఎన్నికలపై గ్రామ సభ నిర్వహించారు. పాతనేరస్తులు, రౌడీ షీటర్లతో మాట్లాడారు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురి చేయడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్యాక్షన్‌తో సంబంధం ఉన్న వారి కదలికలపై నిఘా ఉంచామన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

జిల్లా ట్రెజరీలో ఏజీ తనిఖీలు

● మార్చి 1 వరకు కొనసాగనున్న ఆడిట్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ కార్యాలయంలో అకౌంటెంట్ జనరల్(ఏజీ) టీమ్ 2023–24లో చేపట్టిన లావాదేవీలపై తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ నెల 26న మొదలైన వార్షిక తనిఖీలు మార్చి నెల 1వ తేదీ వరకు కొనసాగుతాయి. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రాజశేఖర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ జాకీర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్ సుందర్‌రావు బృందం తనిఖీలు చేస్తోంది. 2023–24లో ట్రెజరీ ద్వారా చేపట్టిన చెల్లింపులు, జమలు, స్ట్రాంగ్ రూము, పెన్షన్‌ల చెల్లింపులు తదితరాలపై ఆడిట్ నిర్వహిస్తోంది. జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు ఆధ్వర్యంలో సంబంధిత సెక్షన్ ఏటీవోలు, ఎస్‌టీవోలు, సీనియర్ అకౌంటెంట్లు ఏజీ తనిఖీలకు సహకరిస్తున్నారు.

ఇద్దరు సీఐలకు స్థానచలనం

కర్నూలు: కర్నూలు పోలీస్ రేంజ్ పరిధిలో ఇద్దరు సీఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు డీఐజీ సీహెచ్ విజయరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నంద్యాల ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న కె.కంబగిరి రాముడును ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ చేసి.. అక్కడ ఉన్న గంటా సుబ్బారావును బనగానపల్లె యూపీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెంటనే తమకు కేటాయించిన స్థానాల్లో చేరిపోవాలని డీఐజీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



వీరప్రకాశ్ (ఫైల్)

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామానికి చెందిన వీరప్రకాశ్ (50) బుధవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. దివ్యాంగుల హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న మృతుడు వీరప్రకాశ్ అందరికీ సుపరిచితుడు. పత్తికొండలో పని ముగించుకుని ఆటోలో గ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో పుచ్చకాయలమాడకు చెందిన ట్రాక్టర్‌ను కొనుగోలు చేసిన చనుగొండ్లకు చెందిన వారు పూజ చేసుకుని పత్తికొండ వైపు వస్తున్నారు. ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న వ్యవసాయ పనిముట్లు ఆటోకు తగలడంతో అందులో ఉన్న వీరప్రకాశ్ తల ఛిద్రమైంది. ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న కృష్ణమూర్తి తీవ్రంగా గాయపడగా, ఆనంద్, సురేష్, సువర్ణకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం స్థానికులు పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వీరప్రకాశ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య ఉరుకుందమ్మ, కుమారుడు హర్ష ఉన్నారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులకు శివ'గంగ' సిద్ధం

● మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు
● రోజుకు 30 లక్షల గ్యాలన్ల నీరు సరఫరా
● భక్తుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
● దేవస్థాన, పీహెచ్‌సీ వైద్యశాలలతో పాటు 30 పడకల తాత్కాలిక వైద్యశాల
● దేవస్థాన సిబ్బందితో పాటు అదనంగా 800 మంది పారిశుధ్య కార్మికులు



శ్రీశైల దేవస్థాన వాటర్ ట్రీట్‌మ్మెంట్ ప్లాంట్

శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలానికి తరలివచ్చే భక్తులకు తాగునీటిని సరఫరా చేసేందుకు దేవస్థాన అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. రోజుకు 30 లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతుందని అంచనా వేసి ఆ దిశగా సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాతాళగంగలో కృష్ణమ్మ అడుగంటినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో బ్రహ్మోత్సవాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నారు.

శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థాన అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తోంది. పాతాళగంగ నుంచి రోజుకు 30 లక్షల గ్యాలన్ల నీటిని పంపింగ్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందులో ఫిల్టర్ వాటర్ 20 లక్షల గ్యాలన్లు, క్లోరిఫైడ్ వాటర్ 10 లక్షల గ్యాలన్లు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు. క్షేత్ర పరిధిలోని వివిధ ప్రదేశాలలో భక్తుల సౌకర్యార్థం మొత్తం 30 చోట్ల వాటర్ స్టోరేజ్ ట్యాంకులు, 450 పబ్లిక్ ట్యాప్‌లు, 100 షవర్‌బాత్‌లు ఏర్పాటు చేశారు. అలాగే క్షేత్ర పరిధిలోని వివిధ చోట్ల 15 ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనున్నారు.

భక్తుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల ఆరోగ్యంపై దేవస్థానం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాలకు చెందిన మెడికల్ టీం బ్రహ్మోత్సవ విధుల్లో పాల్గొంటారు. క్షేత్ర పరిధిలో వివిధ ప్రదేశాలలో 10 చోట్ల ఉచిత మెడికల్ క్యాంప్‌ల ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల, దేవస్థాన వైద్యశాలతో పాటు పీహెచ్‌సీ వద్ద 30 పడకల తాత్కాలిక వైద్యశాల ఏర్పాటు చేస్తున్నారు. సున్నిపెంటలోని సీహెచ్‌సీలో నిపుణులైన డాక్టర్లు, అన్ని రకాల మందులు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎనిమిది 108 అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచుతున్నారు. భక్తులకు ఎటువంటి ఆరోగ్యసమస్యలు ఎదురైనా పరిష్కరించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ ప్రణాళికలను రూపొందించుకుంది.

800 మంది పారిశుధ్య కార్మికులతో పనులు

జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. మొత్తం క్షేత్రాన్ని 10 జోన్లు, 45 సెక్టార్లుగా విభజించి పారిశుధ్య పనులు చేపడుతున్నారు. 800 మంది పారిశుధ్య కార్మికులు, 10 ట్రాక్టర్లు, 100 మంది లోడింగ్ సిబ్బంది, అదనంగా దేవస్థాన సిబ్బందిని నియమించారు. అలాగే క్షేత్ర పరిధిలో శాశ్వత మరుగుదొడ్లు–333, మరుగుదొడ్లు, స్నానం చేసుకునేలా నూతనంగా నిర్మించిన 160, టాటా టాయిలెట్స్–172, నమా టాయిలెట్స్–58 మొత్తం క్షేత్ర పరిధిలో 723 టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. పలుచోట్ల తాత్కాలిక టాయిలెట్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తనివ్వం



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైలానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తనివ్వం. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశాం. అక్కడక్కడా మిగిలిపోయిన పనులను త్వరలో పూర్తి చేస్తాం. తాగునీరు, వైద్యం, పారిశుధ్య పనులను మొదటి ప్రాధాన్యతగా గుర్తించి ఆమేరకు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి



క్షేత్రంలో వాటర్‌స్టోరేజ్ ట్యాంకు



క్షేత్ర పరిధిలో వివిధ చోట్ల శౌచాలయాలు



శ్రీశైలంలో పీహెచ్‌సీ కేంద్రం

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. ముల్లాన్‌పేటకు చెందిన షేక్ జాకీర్, రాణిమహారాణి థియేటర్ వద్ద హసన్ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడారు. వారిని కోర్టులో ప్రవేశపెట్టగా విచారించిన న్యాయ స్థానం ఒక్కొక్కరికి ఏడు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

మూడు టిప్పర్లు సీజ్

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం తడకనపల్లె గ్రామం సర్వే నంబర్ 330లో అక్రమంగా ఎర్రమట్టిని తవ్వి తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారనే సమాచారంతో బుధవారం జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారన్నారు. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న ఏపీ 39యూకే 4356,ఏపీ 30ఎక్స్ 2605, ఏపీ 29టీఏ 2480 నంబర్లు గల టిప్పర్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు. సుంకన్న, జాన్ అనే వ్యక్తులు అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారని విచారణలో తేలిందన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి,టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బొమ్మలసత్రం: స్థలం విషయంలో బెదిరింపులకు పాల్పడటంతో మనస్థాపంతో పట్టణానికి చెందిన షేక్ అలిబాషా ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. షేక్ అలీబాషా, రేష్మా దంపతులు బొమ్మలసత్రం సమీపంలోని ఇస్లాంపేటలో నివాసముంటున్నారు. అలీబాషా చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్థలం విషయంలో అలీబాషా, ఉబేదుల్లా నాలుగేళ్ల క్రితం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో మంగళవారం అలీబాషా ఇంటి వద్దకు ఉబేదుల్లా వెళ్లి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆయన రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించగా గమనించిన భార్య కేకలు వేయటంతో సమీపంలోని వారు ఆయనను కిందకు దించారు. అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని వైద్యులు పేర్కొన్నారు. బాధితుడి భార్య రేష్మ త్రీటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది.

బ్యాంకింగ్ వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాలి

● విద్యార్థులతో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు



క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎల్‌డీఎం తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): విద్యార్థి దశ నుంచే బ్యాంకింగ్ వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్(ఎల్‌డీఎం) ఎస్‌ఆర్ రామచంద్రరావు సూచించారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం స్థానిక టౌన్ మోడల్ మున్సిపల్ హైస్కూల్‌లో క్విజ్ ఈవెంట్ బ్యాంకింగ్ వ్యవహారాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం మాట్లాడుతూ...రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా 2016 నుంచి ప్రతి ఏటా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తూ అన్ని వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ వ్యవహారాలపై అవగాహన కల్పిస్తోందని తెలిపారు. ఈ ఏడాది 'మేక్ ఏ రైట్ స్టార్ట్ బికమ్ ఫైనాన్సియల్ స్మార్ట్' అనే థీమ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. తర్వాత క్విజ్ ఈవెంట్‌లో రాణించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టౌన్‌మోడల్ హైస్కూల్ ప్రధానోపధ్యాయులు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కుందూలో మట్టి అక్రమ తవ్వకాలు

● నిర్మాణంలో ఉన్న వంతెన పక్కనే దర్జాగా తవ్వకాలు
● రాత్రి వేళల్లో గుట్టుగా ట్రాక్టర్లలో తరలింపు
● వంతెనకు పొంచి ఉన్న ముప్పు



కుందూ బ్రిడ్జి పిల్లర్ సమీపంలో మట్టిని తవ్విన ప్రాంతం



ఓ ప్రైవేట్ స్థలంలోకి మట్టిని తరలిస్తున్న దృశ్యం

నంద్యాల(సెంట్రల్): కుందూనది అక్రమార్కులకు అడ్డాగా మారింది. ఇన్నాళ్లూ కుందూ నది వెంట నిర్మానుష్య ప్రదేశాల్లో మట్టిని కాజేస్తూ వచ్చిన మట్టి మాఫియా ఇప్పుడు ఏకంగా ప్రధాన రహదారి పక్కనే దర్జాగా తవ్వకాలు జరుపుతోంది. నంద్యాల నుంచి పులిమద్ది వెళ్లే రహదారిపై రాణి మహారాణి థియేటర్ వద్ద నిర్మిస్తున్న వంతెన పక్కనే అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. పగలైతే తమ బండారం బయటపడుతుందని రాత్రి వేళల్లో పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. సాధారణంగా చెరువులు, నదులు, ప్రభుత్వ భూముల్లో మట్టిని తరలించాలంటే సంబంధిత శాఖల అనుమతి తప్పనిసరి. కానీ నిబంధనలను బేఖాతరు చేస్తూ సరాసరి నిర్మాణంలో ఉన్న వంతెన పిల్లర్లకు అతి సమీపంలో తవ్వకాలు జరుపుతున్నారు. దీనివల్ల నదికి వరద ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వంతెన పిల్లర్లు దెబ్బతినే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇలా తరలిస్తున్న మట్టిని పక్కనే ఉన్న ప్రైవేటు నిర్మాణాలు, సంస్థలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అనధికారికంగా జరుగుతున్న తవ్వకాలతో ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండిపడడంతో పాటు, వంతెనకు ముప్పు పొంచి ఉంది. దీనిపై కేసీ కాలువ ఈఈ తిరుమలేశ్వర్ రెడ్డిని వివరణ కోరగా తవ్వకాలకు తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఉత్సవ పల్లకీని మోసుకెళ్తున్న దృశ్యం



విద్యుత్ దీపాలతో సుందరంగా రహదారి

ముగిసిన పార్వేట

● ఇస్కాన్ వద్ద వీడ్కోలు పలికేందుకు ప్రత్యేక ఏర్పాట్లు



ఇస్కాన్ టెంపుల్ వద్ద సంప్రదాయ దుస్తుల్లో రష్యా భక్తులు

రుద్రవరం: అహోబిలేశుడి పార్వేట ఉత్సవం బుధవారంతో ముగిసింది. గత నెల 16న అహోబిలం నుంచి బయలు దేరిన ఉత్సవమూర్తుల పల్లకీ ఆళ్లగడ్డ, రుద్రవరం, ఉయ్యాలవాడ మండలాల్లోని 33 గ్రామాల్లో 44రోజుల పాటు పర్యటించి ఆయా గ్రామాల ప్రజల నుంచి విశేష పూజలు అందుకున్న స్వామివారు రుద్రవరానికి చేరుకున్నారు. నాలుగు రోజుల పాటు 44 తెల్పులపై పూజలు అందుకున్న ఉత్సవ మూర్తుల పల్లకీ చివరగా అటవీ కార్యాలయ ప్రాంగణానికి చేరుకుంది. అక్కడ పూజా కార్యక్రమాల అనంతరం బోయలు దుర్వి నరసింహ స్వామి మీదుగా అహోబిలం రహదారికి పల్లకీని కాలినడకన తరలించారు. అక్కడికి రాగానే ఇస్కాన్ టెంపుల్ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ చంద్రకేశవదాస్ ఆధ్వర్యంలో రష్యా దేశస్తులతో పాటు వివిధ గ్రామాల నుంచి వేలాదిగా వచ్చిన ప్రజలు స్వాగతించారు. ఇస్కాన్ టెంపుల్ పరిధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ఉత్సవమూర్తుల పల్లకీని కొలువుదీర్చారు. గురువారం తెల్లవారు జామున స్వామి వారి పల్లకీని అహోబిలానికి తరలిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. తెల్లవారు జామున వీడ్కోలు పలికేందుకు వచ్చే భక్తులకు ఇస్కాన్ టెంపుల్ వారు అన్నదానం చేయనున్నారు.

ఆధ్యాత్మికవేత్త మృతి



ఉయ్యాలవాడ: స్థానిక కుందూనది ఒడ్డున వెలిసిన వేణుగోపాల స్వామి ఆశ్రమంలో అవధూత సుబ్బారెడ్డి స్వామి వారి ప్రథమ శిష్యురాలు అయిన ఆధ్యాత్మికవేత్త దాసరి సుబ్బమ్మ(86) బుధవారం శివైక్యం పొందారు. ఈమె వారం రోజులుగా అనారోగ్యంతో నంద్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తనువు చాలించారు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సుబ్బమ్మ అవ్వ ఆశ్రమంలో నిత్యం భగవద్గీతను పారాయణం చేసేది. సుబ్బమ్మ నిరక్షరాస్యురాలు అయినప్పటికీ ఏక సంధాగ్రాహి. భగవద్గీతలోని 18 అధ్యాయాలను కంఠస్థం చేసి సుబ్బారెడ్డి స్వామి ప్రథమ శిష్యురాలుగా చేరింది. భగవద్గీత పారాయణంపై వైఎస్సార్ జిల్లా, అనంతపురం జిల్లాలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. అలాగే గ్రామంలోని చాలా మంది మహిళలకు భగవద్గీత పారాయణాన్ని నేర్పించారు.

కారు బోల్తా.. యువకుడి మృతి



మృతుడు నవీన్ (ఫైల్)



రోదిస్తున్న కుటుంబసభ్యులు

మద్దికెర: కారు బోల్తా పడి నవీన్ (20) అనే యువకుడు మృత్యువాతపడ్డాడు. ఈ దుర్ఘటన బుధవారం తెల్లవారుజామున పెరవలి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... పెరవలి గ్రామానికి చెందిన వడ్డే రామాంజనేయులు, సుధారాణి దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రాజంపేటలో జరిగే వివాహానికి అందరూ కలిసి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాదులో ఉన్న బంధువులు గ్రామానికి వస్తుండడంతో వారిని తీసుకొని రావడానికి డ్రైవర్‌తో కలసి రామాంజనేయులు కుమారుడు నవీన్ బుధవారం తెల్లవారుజామున కారులో గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు బయలుదేరారు. అయితే పెరవలి గ్రామ శివారులో ఉన్న హంద్రీనీవా కాలువ దాటిన తరువాత కారు టైరు పంక్చరు కావడంతో బోల్తాపడింది. దీంతో డ్రైవరు, నవీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. వైద్యం కోసం గుంతకల్లుకు తరలించగా.. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలులో చికిత్స పొందుతూ నవీన్ మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వైఎస్‌ఆర్ పెన్షన్ కానుకకు రూ.140.56 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీకి ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.140.56 కోట్లు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 4,71,136 పింఛనుదారులకు ఈ మొత్తం పంపిణీ చేయనున్నారు. గురువారం వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సంబంధిత బ్యాంకుల నుంచి వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక నిధులను డ్రా చేయనున్నారు. 1వ తేదీ (శుక్రవారం) ఉదయం 5 గంటల నుంచి వార్డు, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా, డీఆర్‌డీఏ అదనపు పీడీ షరీఫ్ తెలిపారు. నంద్యాల జిల్లాలో 2,23,598 పింఛన్లకు రూ.66,44,86,500 పంపిణీ చేయనున్నారు.

వేసవిలో 'ఉద్యాన' యాజమాన్యం

● అరటి గెలల చుట్టూ ఎండు ఆకు చుట్టాలి
● లేత మామిడి తోటలకు నీరు పెట్టాలి
● ఉద్యానశాఖ సహాయ సంచాలకులు పి.రామాంజనేయులు సూచనలు



పూతతో కళకళలాడుతున్న మామిడి చెట్టు

కర్నూలు అగ్రికల్చర్: వేసవి కాలం సమీపించింది. ఉద్యాన రైతులు మామిడి, అరటి, చీనీ, నిమ్మ, జామ వంటి తోటలలో యాజమాన్య పద్ధతులను పాటించాల్సి ఉంది. తగిన జాగ్రత్తలు చేపట్టకపోతే చెట్లు అధిక ఉష్ణోగ్రతలకులోనై దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. వేసవిలో ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు ఉద్యానశాఖ సహాయ సంచాలకులు పి.రామాంజనేయులు పలు సూచనలు చేశారు. వివరాలు..

☛ మామిడి ప్రస్తుతం పిందెతో ఉంటుంది. పిందె రాలకుండా నిలబెట్టుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పొటాషియం నైట్రేటు లీటరు నీటికి 10 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదంటే ప్లానోఫిక్స్ నాలుగు లీటర్ల నీటికి 1 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలి. దోమ వ్యాపించే అవకాశం కూడా ఉంది. దీని నివారణకు కాన్ఫిడార్ లీటరు నీటికి 0.5 ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ కాలంలో పండు ఈగ ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు తోటల్లో 2మి.లీ మలథియాన్, 2 మిల్లిలీటర్లు మిథైల్ యుజీనాల్ లీటరు నీటికి కలిపి ఎర ద్రావణం తయారు చేసి ఒక్కొక్క ప్లాస్టిక్ పళ్లెంలో 250 మిల్లి లీటరు పోసి ఎకరాకు నాలుగు చోట్ల ఉంచాలి. ప్యాకింగ్ చేసిన మామిడి కాయలను దూర ప్రాంత రవాణాకు కోసిన 6–8 గంటలలోను శీతల గిడ్డంగులలో 12.5 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత 80–90 శాతం తేమ వద్ద నిల్వ ఉంచాలి. లేత తోటలలో మొక్కలకు నీరు పెట్టడం ద్వారా ఎండ వేడిమి నుంచి కాపాడుకోవచ్చును.

☛ అరటిలో వైరస్ తెగుళ్లు వ్యాప్తి చేసే రసం పీల్చే పురుగుల నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవిశె లాంటి త్వరగా పెరిగే మొక్కలను తోట చుట్టూ 3–4 వరుసలు నాటుకుంటే వేడి గాలులను అడ్డుకుంటాయి. గెలల సగం పూర్తి అయ్యాక కార్శి పంట కోసం ఒక సూది పిలకను వదిలి మిగిలిన పిలకలను కోసి వెయ్యాలి. వేసవిలో గెలల రక్షణకు గెలలకు ఎండు ఆకు చుట్టి ఎండ నుంచి రక్షించాలి. గెలలు వేయడానికి సిద్ధంగా ఉన్న, లేత గెలల తోటలో వడ గాలులకు ఆకులు పూర్తిగా మాడిపోయి ఎండిపోతాయి. అరటి గెలలు సరిగా తయారుగాక ఎండ వేడిమికి మాడిపోతాయి. ఇటువంటి తోటలకు నీటి తడులు దగ్గర దగ్గరగా ఇవ్వాలి. లీటరు నీటికి 5 గ్రాములు పోటాషియం నైట్రేట్ లేదంటే సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌లను మార్చి, మార్చి జిగురుతో కలిపి వారం రోజుల వ్యవధిలో నాలుగుసార్లు ఆకులు, గెలలు పూర్తిగా తడిచేలా పిచికారి చేసి నష్టాన్ని కొంతవరకు నివారించవచ్చును.

☛ చీనీ, నిమ్మ తోటల్లో చెట్లపై మంగు నివారణకు డైకోపాల్ 3మిల్లి లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అధిక వేడి నుంచి చెట్లను కాపాడుకోవటానికి చెట్ల పాదల్లో ఎండు ఆకులు, వరి పొట్టు పోసుకోవాలి. లీటరు నీటికి 20 గ్రాములు సున్నం కలిపిన ద్రావణాన్ని పల్చటి తెల్లటి పొర ఏర్పడే విధంగా చెట్లపైన కాయలపైన పిచికారీ చేయాలి. ఈ ద్రావణంతో పాటు జిగురు కొద్దిగా కలుపుకుంటే సున్నం ఆకులను, కాయలకు బాగా అతుక్కొని ఎక్కువ కాలం ఉంటుంది.

☛ జామలో బెరడు తొలిచే పురుగు నివారణకు కాండం రంధ్రాల్లో 5మిల్లీ లీటరు డైక్లోరోవాస్ లేదా కిరోసిన్ పోసి బంక మట్టితో పూడ్చాలి.

☛ సపోటా లేత తోటలకు తప్పనిసరిగా నీరు పెట్టాలి. ముదురు తోటలకు అవసరాన్ని బట్టి నీటి తడులు ఇవ్వాలి.